# థేమ్స్.. థీమ్స్.. ఒక్క ఇల్లూ కూల్చలేదు

- థేమ్స్ నదికి రెండు వేల ఏండ్లకు పైగా ఘన చరిత్ర
- కాలుష్యం నుంచి స్వచ్ఛ నదిగా కొత్త రూపు
- నది ఒడ్డున నిర్మాణాలు కూల్చకుండానే పనులు
- పకడ్బందీ ప్రణాళిక, సీవరేజ్ ట్రీట్మెంట్‌తో సుసాధ్యం
- ఆకస్మిక వరదల నియంత్రణకు 'ఫ్లడ్ కంట్రోల్ సిస్టం'
- ఎఫ్‌టీఎల్, బఫర్ అంటే లండన్ ఉండేదా?
- మూసీ ప్రాజెక్టులో కనిపించని 'థేమ్స్ యాక్షన్ ప్లాన్'
- కూల్చివేతతో బడుగుల జీవితాలు బుగ్గి

మూసీ అభివృద్ధికి 'థేమ్స్ యాక్షన్ ప్లాన్'ను అమలు చేస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి.. దాన్ని పక్కనబెట్టి బడుగుల ఇండ్లను కూల్చడమే లక్ష్యంగా తన 'యాక్షన్ ప్లాన్'ను ముందుకు తీసుకుపోతున్నట్టు అనుమానాలు కలుగుతున్నాయి. ఈ కూల్చివేత చర్యలను చూస్తే జనవరిలో లండన్ పర్యటనలో సీఎం అసలు 'థేమ్స్ నది పునరుజ్జీవ ప్లాన్'పై నిజంగానే అధ్యయనం చేశారా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. థేమ్స్‌ను శుద్ధిచేయడానికి నది ఒడ్డున నివసిస్తున్న ఏ ఒక్కరినీ తరలించలేదు. ఒక్క ఇంటిని కూడా కూల్చలేదు. అయితే, ఇక్కడ మూసీనదీ పరీవాహకప్రాంతాల్లో ఇండ్ల తొలగింపు నిత్యకృత్యంగా మారింది. ఈ ఒక్క విషయమే కాదు సీవరేజ్ ట్రీట్మెంట్, ఫ్లడ్ కంట్రోల్ కార్యాచరణ తదితర విషయాల్లోనూ 'థేమ్స్ ప్లాన్'ను మన ప్రభుత్వం ఎక్కడా అనుసరించినట్టు కనిపించట్లేదు.

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): మూసీ అభివృద్ధికి థేమ్స్ నది ప్లాన్‌ను అమలు చేస్తామని జనవరిలో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. దీని కోసం లండన్‌లో ఆయన మూడురోజుల పాటు ప్రత్యేకంగా పర్యటించారు కూడా. అయితే, క్షేత్రస్థాయిలో థేమ్స్ నది ప్లాన్‌ను మూసీకి అన్వయిస్తున్నట్టు కనిపించడంలేదు. మూసీ సుందరీకరణ పేరిట బడుగు వర్గాలు కట్టుకున్న ఇండ్లను కాంగ్రెస్ సర్కారు నిర్దాక్షిణ్యంగా కూల్చేస్తుండటమే దీనికి రుజువు.

> లండన్ పర్యటనలో ఉన్నప్పుడు థేమ్స్ నది నిర్వహణ తీరు, రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు అభివృద్ధిపై అధ్యయనం చేశా. థేమ్స్ రివర్ ప్రాజెక్టు తరహాలో హైదరాబాద్‌లోని మూసీనది పునరుజ్జీవ ప్రాజెక్టు చేపడతాం.
>
> - జనవరి 19న సీఎం రేవంత్ రెడ్డి

### కాలుష్యానికి చిరునామాగా..

శతాబ్దాల చరిత్ర కలిగి, ఒకప్పుడు కాలుష్యానికి చిరునామాగా ఉండే థేమ్స్ నది.. ఇప్పుడు స్వచ్ఛమైన జీవనధారగా మారింది. ఏండ్లకేండ్లు చిత్తశుద్ధితో కూడిన పకడ్బందీ చర్యలతోనే ఇది సాకారమైంది. 346 కిలోమీటర్ల పొడవైన థేమ్స్‌నది ఇంగ్లండ్‌కు నైరుతి దిశగా ఉన్న గ్లౌసెస్టర్‌షైర్ రాష్ట్రంలోని థేమ్స్‌హెడ్ పర్వతాల్లో ప్రారంభమౌతుంది. టెడ్డింగ్టన్, స్టెయిన్స్ అపాన్ థేమ్స్, హెన్లే ఆన్ థేమ్స్, ఆక్స్‌ఫర్డ్, రీడింగ్, మైడెన్‌హెడ్, విండ్‌సోర్, లండన్ తదితర నగరాల గుండా ప్రవహించి ఉత్తర సముద్రంలో కలుస్తుంది. క్రీస్తుశకం 45వ సంవత్సరం నుంచే థేమ్స్ నది ఒడ్డున పట్టణ నాగరికత పరిఢవిల్లినట్టు చరిత్ర చెప్తున్నది. 18వ శతాబ్దంలో ఐరోపావ్యాప్తంగా పారిశ్రామికీకరణ ఊపందుకోవడం, నగర జనాభా పెరిగిపోవడంతో ఇంగ్లండ్ పట్టణాల గుండా ప్రవహిస్తున్న థేమ్స్ నదిలో వ్యర్థాలు కలవడం పెరిగింది. దీంతో అప్పటివరకూ స్వచ్ఛమైన నీటితో అలరారే థేమ్స్ కాలుష్యానికి చిరునామాగా మారింది.




### క్వీన్ విక్టోరియా కూడా..

థేమ్స్ నది ఒడ్డున నివాసాలు, పరిశ్రమలు పెరిగిపోవడంతో నదిలో కలిసే వ్యర్థాల మోతాదు పెరిగిపోయింది. 'థేమ్స్‌కంపు కొడుతున్నది. నది ఒడ్డున నిలబడలేని స్థితి' అంటూ 1858 జూన్ 29న క్వీన్ విక్టోరియా తన కుమార్తెకు పంపిన లేఖలో రాశారంటే నది పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. థేమ్స్‌ను ప్రక్షాళన చేయకపోతే, భవిష్యత్తు తరాల మనుగడకే ముప్పు అని గ్రహించిన అప్పటి ప్రభుత్వం తాత్కాలిక చర్యలను ముమ్మరం చేసింది. పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలు థేమ్స్‌లో కలవనీయకుండా ప్రత్యేక మార్గాల్లో డిస్పోజ్ చేయడం వంటి పనులు చేపట్టింది. అయితే, కొద్దికాలం వరకు మాత్రమే ఇవి సత్ఫలితాలను ఇచ్చాయి. జనాభా పెరిగిపోవడం, ఫ్యాక్టరీ వ్యర్థాల మోతాదు పరిధిని మించిపోవడంతో శాశ్వతమైన యాక్షన్ ప్లాన్ అవసరమైంది. దీంతో 'థేమ్స్ యాక్షన్ ప్లాన్' తెరమీదకు వచ్చింది.

### కాలుష్య నియంత్రణ

థేమ్స్ నదిని కాలుష్యానికి దూరంగా ఉంచాలంటే తొలుత మురుగు నియంత్రణే మార్గమని 1858లో సివిల్ ఇంజినీర్ సర్ జోసఫ్ బెజెల్‌గెట్ భావించారు. ఇందుకోసం నది ప్రవహించే మార్గానికి రెండువైపులా భూగర్భంలో సొరంగాలను నిర్మించారు. ప్రతి రెండు కిలోమీటర్లకు ఒక మురుగునీటి నిర్వహణ ట్యాంకును ఏర్పాటుచేశారు. 'సీవరేజ్ నెట్‌వర్క్'గా పిలిచే ఈ ట్యాంకులకు ఆ సొరంగాలను పైపులతో అనుసంధానించారు. ఇండ్లు, పరిశ్రమల్లోని వ్యర్థాలు పైపుల గుండా డైరెక్టుగా మురుగునీటి నిర్వహణ ట్యాంకులకు చేరుతాయి. నదిలో కలవవు. అలా నదిలో కాలుష్య వ్యర్థాలు కలవకుండా కట్టడి జరిగింది. దశాబ్దాలు గడిచినప్పటికీ ఈ టెక్నిక్‌నే ఇప్పటికీ పోర్ట్ ఆఫ్ లండన్ అథారిటీ (పీఎల్‌ఏ) అమలు చేస్తున్నది. ఆ తర్వాత 25 కిలోమీటర్ల పొడవైన 'థేమ్స్ టైడ్‌వే టన్నెల్'ను ఏర్పాటుచేశారు. దీని సాయంతో వ్యర్థాలతో కూడిన నీరు థేమ్స్ నదిలో కలవకుండా ప్రత్యేక మార్గం ద్వారా సీవరేజ్ ట్యాంకుల్లో శుద్ధి అవుతున్నది. ఈ శుద్ధి అయిన నీటిని థేమ్స్ పరీవాహంలో పెంచుతున్న ప్రత్యేకమైన ఉద్యానవనాల్లోని మొక్కలకు వినియోగిస్తున్నారు. అలా థేమ్స్ నది కాలుష్యంబారిన పడకుండా రక్షించబడింది. ఇండ్లను, వాణిజ్య సముదాయాలను కూల్చకుండానే, ప్రజలను తరలించకుండానే 'థేమ్స్ టైడ్‌వే టన్నెల్' నిర్మాణం ఇటీవలే జరగడం విశేషం.

### వరదల నియంత్రణ

'థేమ్స్ యాక్షన్ ప్లాన్'లో రెండోది వరదల నియంత్రణ. లండన్ వంటి జనాభా ఎక్కువగా ఉన్న నగరాల గుండా నదీప్రవాహం ఉన్నప్పుడు ఎప్పుడైనా వరదలు సిటీని ముంచెత్తవచ్చు. దీనికి చెక్ పెట్టడానికి వరదల నియంత్రణ కోసం థేమ్స్ నది నగరంలోకి ప్రవేశించే మార్గంలో 'థేమ్స్ బ్యారియర్' పేరిట ప్రభుత్వం ఓ భారీ నిర్మాణాన్ని చేపట్టింది. 3.2 కిలోమీటర్ల వెడల్పుతో పెద్దపెద్ద నియంత్రణ గేట్లను నదికి అడ్డంగా అమర్చారు. ప్రవాహ ఉద్ధృతి పెరగడాన్ని ముందే అంచనా వేసే ఈ అత్యాధునిక వ్యవస్థ 1984 నుంచి ఇప్పటివరకూ థేమ్స్ నదికి 200కు పైగా వరదలు వచ్చినప్పటికీ సమర్థంగా నియంత్రించగలిగింది. ప్రవాహానికి సంబంధించి ముందస్తు రీడింగ్స్ తెలియజేయడం, కాలువల్లోకి నీటిని మళ్లించడంతో వరదలను బ్యారియర్ కట్టడి చేస్తుంది.

### నిర్మాణాలు కూల్చకుండానే..

థేమ్స్ నది ఒడ్డున కోటికి పైగా ఇండ్లు, ఫ్యాక్టరీలు, వాణిజ్య సముదాయాలు ఉంటాయని అధికారుల అంచనా. అయితే, మురుగునీటి నిర్వహణ పేరిట నిర్మించిన 'సీవరేజ్ నెట్‌వర్క్' కోసంగానీ, వరదల నియంత్రణ కోసం నిర్మించిన 'థేమ్స్ బ్యారియర్' కోసంగానీ ఇప్పటివరకూ ఏ ఒక్క నిర్మాణాన్ని కూడా కూల్చేయలేదని పోర్ట్ ఆఫ్ లండన్ అథారిటీ రికార్డులను బట్టి తెలుస్తున్నది. మురుగునీటి కోసం నిర్మించిన సొరంగాలను రోడ్లకు మధ్యలో ఒక మీటరు వెడల్పుతో ఏర్పాటు చేశామని, మురుగునీటి నిర్వహణ ట్యాంకులను ప్రభుత్వానికి చెందిన ఖాళీ ప్రదేశంలో నిర్మించినట్టు అధికారులు తెలిపారు. వరదల నియంత్రణకు తీసుకొచ్చిన 'థేమ్స్ బ్యారియర్'ను నది మధ్యలో నిర్మించినట్టు వివరించారు. ఇక, ఇండ్లల్లో ఉండే ప్రజలకు, వాణిజ్య కార్యకలాపాలకు ఇబ్బందులు ఎదురవకుండా రాత్రిళ్లు, సెలవు దినాల్లోనే ఈ పనులను చేపట్టామని, ప్రజలను ఎక్కడికీ తరలించలేదని వివరించారు.



థేమ్స్ నది ఒడ్డున భారీ నిర్మాణాలు, వాణిజ్య సముదాయాలు

### లండన్ ఉనికే ప్రశ్నార్థకమయ్యేది

మూసీ నది పరీవాహక ప్రాంతంలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మాణాలు ఉన్నాయంటూ రేవంత్ ప్రభుత్వం పేదల ఇండ్లను బుల్డోజర్లతో కూలదోస్తున్నది. అయితే, ఈ నియమాలనే థేమ్స్ నది ఒడ్డున అమలు చేస్తే, లండన్‌లోని దాదాపు 40 శాతం నిర్మాణాలు కనిపించకుండా పోతాయని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీకి చెందిన స్కాలర్ ఒకరు తెలిపారు. లండన్‌లో ప్రఖ్యాతిగాంచిన హ్యాంప్టన్ కోర్టు ప్యాలెస్, టేట్ బ్రిటన్, టేట్ మాడర్న్, ప్యాలెస్ ఆఫ్ వెస్ట్‌మినిస్టర్, లండన్ ఐ, టవర్ బ్రిడ్జి, హెచ్‌ఎంఎస్ బెల్‌ఫాస్ట్, టవర్ ఆఫ్ లండన్, గ్రీన్‌విచ్ పార్క్ తదితర కట్టడాలు, నిర్మాణాలు బఫర్ జోన్‌లోనే ఉన్నాయని గుర్తు చేశారు. ఇక, ఇంగ్లండ్‌లో థేమ్స్ నది ఒడ్డున ఒకవిధంగా ఎఫ్‌టీఎల్ పరిధిలో ఏకంగా ఏడు నగరాలు నిర్మితమయ్యాయంటే షాక్ అవకుండా ఉండలేం. ప్రపంచ టూరిస్టులను ఆకర్షిస్తున్న మార్లో, మైడెన్‌హెడ్, విండ్‌సోర్, ఈటోన్, రీడింగ్, హెన్లే ఆన్ థేమ్స్, కింగ్‌స్టన్ అపాన్ థేమ్స్ తదితర నగరాలు థేమ్స్ నది ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉన్నాయి. రేవంత్ సర్కారు ఎఫ్‌టీఎల్ నిబంధనలు అక్కడగనుక అమలు చేస్తే, ఈ నగరాలన్నింటినీ నేలమట్టం చేయాల్సిందే.


### కూల్చాల్సిన పనిలేదు..

ఎఫ్‌టీఎల్, బఫర్ పరిధి పేరిట, వరదలు ముంచెత్తుతాయన్న కారణంతో నది ఒడ్డున ఉన్న నిర్మాణాలను కూల్చేయాల్సిన పనిలేదని పీఎల్‌ఏ అధికారులు చెప్తున్నారు. 'థేమ్స్ బ్యారియర్' సాయంతో థేమ్స్ నది ప్రవాహ ఉద్ధృతిని ఎప్పటికప్పుడు నియంత్రించడంలో తాము సక్సెస్ అయిన విధానాన్ని గుర్తుచేస్తున్నారు. 'థేమ్స్ బ్యారియర్'తో థేమ్స్ నది ఒడ్డున ఉన్న కట్టడాలకు వరద ముప్పు లేకుండా పోయిందని చెప్తున్నారు. 'థేమ్స్ యాక్షన్ ప్లాన్'లో భాగంగా చేపట్టిన ఈ చర్యలతో పురాతన కట్టడాలు ఇప్పటికీ కనుమరుగవ్వలేదు. పర్యాటకరంగం కూడా భారీగా పుంజుకొన్నది. ప్రతీ పదేండ్లకోసారి థేమ్స్ యాక్షన్ ప్లాన్‌ను ఆధునీకరిస్తామని, కొత్త సాంకేతికతతో వినూత్న విధానాలను అందిపుచ్చుకొంటామని పీఎల్‌ఏ అధికారులు తెలిపారు. అందుకే, థేమ్స్ ఇప్పటికీ, స్వచ్ఛతను కోల్పోలేదని పేర్కొన్నారు.

### 780 ఏండ్ల కిందటే యాక్షన్ ప్లాన్‌కు బీజం

13వ శతాబ్దంలో ఇంగ్లండ్‌లో గతంలో ఎన్నడూచూడని నీటి కరువు తాండవించింది. దీంతో అప్పటి ప్రభుత్వం 1245 సంవత్సరంలో 2.7 మైళ్ల పొడవుతో ఓ పెద్ద సొరంగాన్ని థేమ్స్ నదీ గర్భంవరకూ నిర్మించింది. థేమ్స్‌లో ప్రవహిస్తున్న నీటిలో కొంత ప్రవాహాన్ని పక్కకు తరలించడమే ఈ సొరంగం ప్రధాన ఉద్దేశం. అలా పక్కకు సేకరించిన నీటిని పైపుల ద్వారా మళ్లించి శుద్ధిచేసి సుదూర ప్రాంతాలకు సరఫరా చేసేవారు. ఆ తర్వాతి కాలంలో ఈ పైపుల సంఖ్యను పెంచారు. థేమ్స్ పునరుజ్జీవ కార్యక్రమంలో దీన్ని తొలి ఘట్టంగా చెప్తారు.

## లోకం పోకడ




## కడుపుకాలి తిడితే.. 70 ఏండ్ల వృద్ధుడిపై కేసు

### సీఎంను దుర్భాషలాడాడని కేసు నమోదు

### కేసులు పెట్టాలని ఆదేశించిన మంత్రి పొన్నం

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఖానాపూర్ చెరువు సమీపంలో గుడిసెలు వేసుకుని నివాసముంటున్న వారి ఇంటి స్థలం కొలతలు తీసుకుంటున్న అధికారులను గత శుక్రవారం కాలనీవాసులు అడ్డుకున్నారు. తాము ఎన్నో ఏండ్లుగా ఇక్కడ గుడిసెలు వేసుకుని, భవనాలు కట్టుకుని జీవిస్తున్నామని అధికారులకు మొరపెట్టుకున్నారు. అయినా అధికారులు వినలేదు. హైడ్రా పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం తాము కట్టుకున్న ఇండ్లను కూల్చేస్తుందేమోనని వారు భయంతో ఆందోళనకు గురయ్యారు. ఆ ఆవేదనలో కొందరు కాలనీవాసులు సీఎం రేవంత్‌ను దుర్భాషలాడారు. దీంతో వృద్ధుడు గంగన్నతోపాటు మరికొందరిపై 65(2),5,6, బీఎన్‌ఎస్ పోక్సో కింద కేసులు నమోదు చేసినట్టు ఆదిలాబాద్ వన్ టౌన్ ఎస్సై ఇసాక్ తెలిపారు.

### కేసులు నమోదు చేయండి : మంత్రి పొన్నం

హైడ్రా బాధితుల వీడియోలు, వారి భావోద్వేగాలు, కన్నీటి కథనాలు సోషల్ మీడియాలో ప్రచారం చేసినా, ఆ వీడియోలో పోస్టు చేసినా వెంటనే కేసులు పెడతామని మంత్రి పొన్నం ప్రభాకర్ గత గురువారం హెచ్చరించారు. వ్యక్తిగత దూషణలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలను తిట్టకుండా కోర్టులకు వెళ్లాలని, వచ్చే ఎన్నికల్లో బ్యాలెట్ ద్వారా మీ ఆగ్రహం చూపెట్టాలని ఆ వీడియోలో సలహా ఇచ్చారు.

### కాంగ్రెస్ మళ్ల గెలిస్తే గుండు కొట్టించుకుంట



కేసీఆర్ పదేండ్ల పాలనలో పేదలు బంగారంలా బతికిండ్రు. గరీబోళ్లకు ఆపదలో ఆదుకుని అన్నం పెట్టి అండగా ఉన్నాడు. కాంగ్రెస్ ఇచ్చిన ఒక్క హామీ అమలు కాకపోగా మా ఇండ్లను కూలగొట్టి పేదల బతుకులు ఆగం చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నడు. పేదల ఇండ్లు కూలగొట్టి మా బతుకులు ఆగం చేస్తున్న కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి రాదు. వస్తే నేను గుండుకొట్టించుకుని ఊరంతా తిరుగుత.

– బొడిగం గంగన్న, ఖానాపూర్, ఆదిలాబాద్

## ప్రభుత్వ వాదన విన్నాకే ఉత్తర్వులు

### హైకోర్టు స్పష్టీకరణ, 15న తదుపరి విచారణ

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం అలియాపూర్ గ్రామంలోని 119/21, 22 సర్వే నంబర్లలో ఉన్న నిర్మాణాలను హైడ్రా కూలగొట్టడంపై డీ లక్ష్మి అనే మహిళ ఈ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కే లక్ష్మణ్ మంగళవారం విచారణ చేపట్టారు. హైడ్రా ఏర్పాటుపై ప్రభుత్వ వాదన వినకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని చెప్పారు. హైడ్రాకు ఉన్న చట్టబద్ధత ఏమిటో తెలియజేస్తూ కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను ఈ నెల 15కు వాయిదా వేశారు.



చాదర్‌ఘాట్ ప్రాంతంలోని శంకర్‌నగర్‌లో అధికారులు కూల్చిన ఇంట్లో బాధితుడు



కూల్చివేత నేపథ్యంలో తన ఇంటి నుంచి భయంభయంగా చూస్తున్న మహిళ




శంకర్‌నగర్‌లో మంగళవారం అధికారులు కూల్చేసిన తన ఇంటిని చూపిస్తూ ఆవేదన చెందుతున్న బాధితురాలు



సైదాబాద్ మండలం చాదర్‌ఘాట్‌లోని శంకర్‌నగర్‌లో ఖాళీ చేయించిన ఇండ్లను మంగళవారం కూల్చుతున్న సిబ్బంది

# 150 ఇండ్లు నేలమట్టం

- మూసీ ఒడ్డున ఇండ్ల కూల్చివేతలు షురూ
- పేదల ఆక్రందనలు పట్టని రేవంత్ సర్కార్
- పోలీసుల బందోబస్తుతో ఇండ్లు కూల్చివేత
- చిన్న గల్లీల్లోకి రాని బుల్డోజర్లు, జేసీబీలు
- 50 మంది లేబర్లతో ఇండ్లు భూస్థాపితం

హైదరాబాద్ సిటీబ్యూరో/మలక్‌పేట్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): మూసీ నిర్వాసితుల రోదన సీఎం రేవంత్‌రెడ్డి రాతి గుండెను కదిలించలేకపోయింది. అనుకున్నట్టుగానే మూసీ నిర్వాసితుల నివాసాలను కబలించి వారి బతుకులను చీకట్లోకి నెట్టేసే కుట్రకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే హైదరాబాద్‌లో మూసీ పరివాహక ప్రాంతాల్లో రెడ్ మార్క్ చేసిన ఇండ్లను మంగళవారం కూల్చివేశారు. అడుగడుగునా బాధితులు అడ్డుకునే ప్రయత్నం చేసినా పోలీసుల పహారాలో ఇండ్లను భూస్థాపితం చేశారు. సైదాబాద్ మండలం మూసీ పరివాహక ప్రాంతంలో 150 ఇండ్లను అధికారులు నేలమట్టం చేశారు. కూల్చివేతలు ఇప్పట్లో లేనట్టేనని సన్నాయి నొక్కులు నొక్కినా అధికారులు అందుకు విరుద్ధంగా మూసీలో కూల్చివేతలు ప్రారంభించి నిర్వాసితుల్లో భయాందోళనలు నింపారు. మళ్లీ ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణాన్ని సృష్టించారు. క్షణక్షణం తమ ఇండ్లను ఎక్కడ కూల్చివేస్తారోనని మిగిలిన నిర్వాసితులు కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్నారు. ఇప్పటి వరకు అధికారులు 1,595 నిర్మాణాలను రివర్‌బెడ్‌లో గుర్తించారు. ఇందులో 940 ఇండ్లకు ఆర్‌బీ ఎక్స్ మార్క్ చేసినట్టు ఆర్డీవో మహిపాల్ తెలిపారు. కాగా, మంగళవారం 150 ఇండ్లను మలక్‌పేట ఎమ్మెల్యే సమక్షంలో కూల్చివేసినట్టు అధికారులు తెలిపారు.



చాదర్‌ఘాట్‌లోని శంకర్‌నగర్‌లో ఖాళీ చేయించిన ఇంటిని కూల్చుతున్న సిబ్బంది

### గూడు నేలమట్టం

కాయకష్టం చేసుకుని కట్టుకున్న ఇండ్లు అవి. పైసా పైసా పోగుచేసి నిర్మించుకున్న గూళ్లు. పేదోడి బతుకుకు ఆధారంగా నిలిచిన నివాసాలు. ఏండ్ల తరబడి అందులో జీవించిన నిర్వాసితులు. ఏ వరదా వారిని కదిలించలేదు. ఎన్ని కష్టాలు ఎదురైనా ఆ ఇండ్లల్లోనే వారి బతుకు అని అనుకున్నరు. వాటితో పేగు బంధం ఏర్పాటు చేసుకున్నరు. అలాంటిది.. వారి ఇండ్లను వాళ్లే కూల్చుకుంటున్నారని అధికారులు ప్రకటించడం విడ్డూరంగా ఉన్నది. మలక్‌పేట ఎమ్మెల్యే సమక్షంలో నిర్వాసితులు తమ ఇండ్లను కూల్చుకున్నారని అధికారులు చెప్తున్నా.. వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నది. తమ ఇండ్లను కూల్చొద్దంటూ బాధితులు పెద్దఎత్తున నిరసన చేశారు. వారందరినీ పోలీసులు బెదిరించి అడ్డుకున్నారు. 50 మంది లేబర్లు పెద్దపెద్ద సుత్తెలు, రాడ్లతో ఇండ్లపై దెబ్బలు వేస్తూ పడగొట్టారు. సైదాబాద్ మూసీ పరివాహక ప్రాంతం చిన్న చిన్న గల్లీలు కావడంతో అక్కడికి బుల్డోజర్లు, జేసీబీలు వెళ్లలేకపోయాయి. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యేకు వివరించడంతో తాను చూసుకుంటానని అధికారులకు మాటిచ్చి పడగొట్టించారని అధికారులు అంటున్నారు. కాగా, స్థానిక ఎంఐఎం ఎమ్మెల్యేపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ తరఫున ఉంటామని మాటలు చెప్పి ఇప్పుడు అధికారులతో కలిసిపోవడం ఏమిటని కొంతమంది మహిళలు నిలదీశారు. మరోవైపు రెడ్ మార్క్ ఉన్న కొన్ని ఇండ్లను కూల్చకుండా బాధితులు అడ్డుకోవడంతో అక్కడి నుంచి అధికారులు నిష్క్రమించారు. బుధవారం గాంధీ జయంతి కావటంతో కూల్చివేతలకు బ్రేక్ ఉండనున్నట్టు సమాచారం. మళ్లీ మిగిలిన రెడ్ మార్క్ ఇండ్లను గురువారం నుంచి కూల్చేందుకు అధికారులు సిద్ధం కానున్నారు.

### శంకర్‌నగర్‌లో ఉద్రిక్తత

కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ పాత మలక్‌పేట డివిజన్‌లోని శంకర్‌నగర్‌లోని మూసీ రివర్ బెడ్‌లో పోలీస్ బందోబస్తు మధ్య రెవెన్యూ అధికారులు చేపట్టిన కూల్చివేతలు ఉద్రిక్తతకు దారితీశాయి. షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి, హిమాయత్‌నగర్ తహసీల్దార్ సంధ్యారాణి, వెస్ట్ మారేడ్‌పల్లి తహసీల్దార్ భీమయ్యగౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన కూల్చివేతలు బస్తీవాసులకు తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించాయి. డబుల్ బెడ్రూం ఇండ్ల పట్టాలు ఇచ్చి నివాసాలను ఖాళీ చేయించిన అధికారులు మంగళవారం శంకర్‌నగర్‌లో కూల్చివేతలు చేపట్టేందుకు వెళ్లగా శంకర్‌నగర్ బస్తీవాసులు అధికారులను అడ్డుకోవటంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

### మాతోనే మా ఇండ్లు కూల్చి వేయించారు!

అధికారులు ముందుగా తాత్కాలిక కూల్చివేతలు (లేబర్‌తో ఇంటి పైకప్పులు, దర్వాజలను తొలగింపు పనులు) చేపట్టడంతో తమ సామాన్లు తీసుకునే అవకాశం కల్పించాలని కొందరు బాధితులు అధికారులను కోరటంతో సరేనన్నారు. దాంతో కొందరు పనివాళ్లు కూల్చివేస్తుంటే సామాన్లను తీసుకోగా, కొందరు తామే తీసుకుంటామని, తాము తీసుకున్న తర్వాత కూల్చివేతలు చేపట్టాలని కోరటంతో అధికారులు అవకాశం కల్పించారు. రేకులు, తలుపులు, వాటి ఫ్రేమ్‌లు, కిటికీలు, గ్రిల్స్ తదితర సామగ్రిని బాధితులు తీసుకొని వాహనాల్లో తరలించుకుపోయారు. చెమటోడ్చి.. రూపాయి, రూపాయి పోగేసి ఇండ్లు కట్టుకుంటే తమతోనే తమ ఇండ్లు కూల్చి వేయిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

### మా ఉసురు తగిలిపోతాడు



నాకు భర్త లేడు. 8 మంది కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. నలుగురికి పెండ్లిళ్లు చేసిన. మిగతావారికి చేయాల్సి ఉన్నది. మేమంతా ఒకే ఇంట్లో కలిసి ఉంటున్నం. ఇంట్లో ఐదు గదులు ఉన్నాయి. ఇంత పెద్ద ఇంటిని కూల్చివేసి డబ్బాలాంటి డబుల్ బెడ్రూం ఇచ్చారు. అందులో మేమెలా ఉండేది? వాడికి మా ఉసురు తగిలిపోతాడు.

- ఫాతిమా బీ, శంకర్‌నగర్ బాధితురాలు

### మా కుటుంబాన్ని విడదీశాడు



ఇక్కడ మేం 20 ఏండ్ల నుంచి ఉంటున్నాం. మొత్తం ఏడుగురం ఉంటున్నం. ఈ ఇంటిని కూల్చివేసి చంచల్‌గూడలో డబుల్ బెడ్రూం ఇల్లు ఇచ్చారు. అందులో సగం మందే పడుతున్నారు. మిగతావారి కోసం ఓ పోర్షన్ అద్దెకు తీసుకున్నాం. కుటుంబాన్ని విడదీశాడు.

- అబ్దుల్ రహీం, శంకర్‌నగర్ బాధితుడు


### మార్కింగ్ చేశారు.. ఇల్లు ఇవ్వలేదు



ఈ ఇల్లు మా నాన్న ఇచ్చాడు. నాలుగేండ్ల నుంచి ఇక్కడే ఉంటున్నాం. అధికారులు మా ఇంటికి వచ్చి ఆధార్‌కార్డు, కరెంట్ బిల్లు అన్నీ తీసుకున్నారు. ఇల్లు ఇస్తామని చెప్పి ఆర్‌బీ ఎక్స్ అని ఇంట్లో గోడపై మార్కింగ్ చేశారు. కానీ ఇల్లు ఇవ్వలేదు. ఇంటిముందు గోడ కూలింది. దాన్ని సాకుగా చూపి ఇల్లు ఇవ్వటం లేదు.

– అస్మా బేగం, మూసానగర్ బాధితురాలు

## లా అండ్ 'ఆర్డర్' ఎక్కడ?



హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ) : 'ఇప్పుడు ఆలోచన చేసి.. ఓ మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోకపోతే.. తెలంగాణను మళ్లీ కుక్కలు చింపిన విస్తరి చేస్తారు. శాంతిభద్రతలు అదుపు తప్పుతాయి. రౌడీ మూకలు రాజ్యమేలుతాయి' అని ఎన్నికల సమయంలో కేసీఆర్ చెప్పిన మాటలు నేడు అక్షర సత్యంగా కనిపిస్తున్నాయి. పది నెలల పాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పడంతో ఓ డీజీపీ, హైదరాబాద్‌కు ఇద్దరు సీపీ లు మారాల్సి వచ్చింది. అయినా.. మళ్లీ తెలంగాణలో లా అండ్ ఆర్డర్ నిజంగా ఆర్డర్‌లోనే ఉన్నదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో ఇప్పటికే ఆందోళనలు, నిరసనలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపేందుకు 'పోలీస్ యాక్ట్'ను ప్రయోగిస్తున్నది. అనుమతి లేకుండా ధర్నాలు, ర్యాలీలు, ఆందోళనలు, నిరసనలు, సభ లు, సమావేశాలు, పబ్లిక్ మీటింగులు, రాస్తారోకోలు చేస్తే చర్యలు తీసుకుంటామని పో లీసులు హెచ్చరిస్తున్నారు. సిద్దిపేట కమిషనరే ట్, మెదక్ జిల్లా, నిర్మల్ జిల్లా, సంగారెడ్డి వంటి పలు జిల్లాల్లో పోలీసు యాక్ట్ అమల్లో ఉన్న ది. ప్రజా ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం ఫరిఢవిల్లుతున్నదని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎక్కడికక్కడ ప్రజల హక్కులను కాలరాస్తూ ప్రజాస్వామ్యాన్ని బుల్డోజర్లతో ఖూనీ చేస్తున్నదని పౌరసంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ప్రతిపక్ష నేతలకు భద్రత కరువు

ఓవైపు పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నదని చెప్తూనే ప్రతిపక్ష నేతల పరామర్శల కార్యక్రమానికి పోలీసులు రక్షణ కల్పించలేకపోతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపక్ష నేతలు, బీఆర్‌ఎస్ కార్యకర్తలపై ఎక్కడో ఓ చోట కాంగ్రెస్ కార్యకర్తల దౌ ర్జన్యం కనిపిస్తూనే ఉన్నది. శాంతిభద్రతలను పోలీసులే గాలికి వదిలేస్తుంటే.. డీజీపీ, ఏడీజీ ఏం చేస్తున్నారని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.